## సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**మేడ్చల్:** పట్టణంలోని అర్చన కాలనీలో ఎస్‌డీఎఫ్ చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్ తుడుం గణేష్‌తో కలిసి ప్రారంభించారు. రూ. 18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలలో పచ్చదనం పెంపొందించడానికి కాలనీవాసులు వనమహోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించి మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని ఆమె కోరారు. కాలనీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు జనార్దన్‌రెడ్డి, బుచ్చిరాములు, సుధాకర్‌చారి, కమలాకర్ రెడ్డి, సత్యనారయణ, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో తిరంగా ర్యాలీ

**ఘట్‌కేసర్:** మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ముద్దవరం లక్ష్మీ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో తిరంగా ర్యాలీ సోమవారం ఘనంగా నిర్వహించారు. శివారెడ్డిగూడ హనుమాన్ ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరా రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి పాల్గొనగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు సరస్వతి, సంధ్యారెడ్డి, సరిత, మాధవి, పలు మండలాల మహిళా మోర్చా అధ్యక్షురాళ్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

**కీసర:** డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఆయన (అంబేడ్కర్) ముని మనుమడు భీమ్‌రావు యశ్వంత్ అన్నారు. సోమవారం కీసర అంబేడ్కర్ చౌరస్తాలోనిఅంబేడ్కర్ విగ్రహానికి పూల మాల సమర్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని ఆయన చూపిన బాటలో తాను కూడా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, సంఘం నేతలు రాజలింగం, శీలంమల్లేష్, శ్రీనివాస్, వివిధ పార్టీల నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాగుల రమేష్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్‌ఎస్‌లో సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**మేడ్చల్:** గుండ్లపోచంపల్లిలోని డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం సందడిగా జరిగింది. పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాల ఆవరణలో తిరుగుతూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ అంజనీకుమార్ అగర్వాల్ ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. జీవితంలో ఎవరు ఏవిధంగా రాణించారో ఎవరు ఏఏస్థాయిలో ఉన్నారో తదితర విషయాలను పరస్పరం చర్చించుకున్నారు.

## నాగారంలో బీజేపీ నేతల నిరసన ర్యాలీ

**కీసర:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణ హోమం, అరాచకాలకు నిరసనగా బీజేపీ నాగారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రాంపల్లి చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, పలువురు బీజేపీ నేతలు మాట్లాడుతూ... బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్‌చేశారు. బీజేపీ నాగారం మున్సిపల్ శాఖ అధ్యక్షుడు బుద్దవరం వేణుగోపాల్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ ప్రధానకార్యదర్శి జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, గణపురం శ్యాంసుందర్, సూర్యశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నక్క కిషోర్‌గౌడ్, రమేష్, సురేందర్‌రెడ్డి, పెద్దిరెడ్డిప్రసాద్, జూపల్లి నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప బోనాలు

**ఘట్‌కేసర్:** మర్పల్లిగూడలో కురుమ సంఘం ఆధ్వర్యంలో కురుమల ఆరాధ్య దైవం బీరప్ప బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనాలను గ్రామం నుంచి ఆలయం వరకు ఒగ్గు కళాకారులు, డోలు వాయిద్యాలతో భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. సంఘం పెద్ద కురుమ మేకల మైసయ్య వీరభోజనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, స్వామి వివేకానంద యూత్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికురాలు అదృశ్యం


బాలమణి

**పోచారం:** మున్సిపల్ కార్మికురాలు అదృశ్యమైన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన కావడి బాలమణి (35) మున్సిపల్ కార్మికురాలుగా పనిచేస్తోంది. ఆదివారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త కావడి రవి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### కస్టమ్స్ ఆఫీసర్ పేరుతో టోకరా

ఓ వ్యక్తికి నకిలీ కస్టమ్స్ ఆఫీసర్ మోసగించిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం ... పోచారం మున్సిపాలిటీకి చెందిన నరేష్‌ను స్కైప్‌లో లాగిన్ అవ్వమని మే 3న ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు నరేష్ మీద కేసు నమోదైందని చెప్పాడు. తాను కస్టమ్స్ ఆఫీసర్‌నని రూ. 20 వేలు నగదు బదిలీ చేస్తే కేసు నుండి తప్పిస్తానని చెప్పాడు. దీంతో అతను రూ. 20 వేలు బదిలీ చేశాడు. తర్వాత మళ్లీ మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో వరసగా రూ. 34,200, రూ. 30 వేలు, రూ. 30 వేలు ప్రకారం మొత్తం రూ. 1.14 లక్షలు పంపాడు. అయినప్పటికీ మరోసారి రూ. 30 వేలు పంపాలని డిమాండ్ చేయడంతో తాను మోసపోయానని తెలుసుకొని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


కేశవులు (ఫైల్)

**శామీర్‌పేట్:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... తూంకుట మున్సిపాలిటీ పోతాయిపల్లికి చెందిన జమ్ముల కేశవులు(54) మరో వ్యక్తితో కలిసి ఆదివారం తూంకుంటలో చికెన్ కొనుగోలు చేసి పోతాయిపల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులతో వేగంగా దూసుకొచ్చిన ఓ బైక్ కేశవులను ఢీకొట్టారు. దీంతో అతడు రోడ్డుపై పడి తల, ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# స్థలాల క్రమబద్ధీకరణపై కదలిక

**మూడు నెలల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేలా కసరత్తు**

- నోటీసు సమస్యల నివృత్తికి సహాయ కేంద్రాలు
- నాలుగు దశల్లో దరఖాస్తుల పరిశీలనకు చర్యలు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 1.43 లక్షలు



**సాక్షి, సిటీబ్యూరో:** అక్రమ లే అవుటు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వీటిని మూడు నెలల్లో పరిష్కరిస్తామని తాజాగా సర్కారు ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందుకు సంబంధించి విధివిధానాలు జారీ కావటంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వేలాది మందికి లబ్ధి చేకూరనుంది.

- గత ప్రభుత్వ హయాంలో పురపారపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల పరిధిలో 2020 ఆగస్టు 26 ముందు రిజిస్టర్ అయిన అనధికారిక ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అనుమతి ఇచ్చింది. అందులో భాగంగానే అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్‌లో రూ. వెయ్యి చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. అప్పటి నుంచి దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీటికి క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.
- జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి 1,39,030 దరఖాస్తులు రాగా, అలాగే, 61 గ్రామ పంచాయతీల పరిధిలో 4,897 దరఖాస్తులు వచ్చాయి.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 1,43,927 రాగా, వీటికి ఒక్కో దరఖాస్తుకు రూ. 1,000 చొప్పున ఫీజు వసూలు చేశారు. ప్రభుత్వానికి వీటి ద్వారానే రూ. 14.39 కోట్ల ఆదాయం సమకూరింది.

### సహాయ కేంద్రాల ఏర్పాటుపై...

స్థలాల క్రమబద్ధీకరణపై జారీ చేయనున్న నోటీసులకు సంబంధించిన ఏమైనా సమస్యలు తలెత్తితే... వాటిని నివృత్తి చేసేందుకు కలెక్టరేట్, పురపాలక సంఘాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

- జిల్లాలో అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినందున సదరు ప్రక్రియకు సంబంధించి ప్రతి వారం సమీక్ష చేసేందుకు చర్యలు తీసుకునే అవకాశాన్నీ పరిశీలిస్తున్నారు.

### నిధుల వరద...

నిధులు లేక ఇబ్బంది పడుతున్న పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలకు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పెద్దమొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉంది. ప్లాటు మార్కెటు విలువలో 14 శాతం ఫీజు వసూలు చేయనుంది. చాలా పట్టణాల్లో విలువైన ప్రాంతాల్లోనే అనధికారిక ప్లాట్లు ఉండడంతో 13 పురపాలక సంఘాలతోపాటు 61 గ్రామ పంచాయతీల్లో రూ. కోట్లల్లో ఆదాయం సమకూరుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో పట్టణాలు ,గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు అవకాశం ఉంటోంది.

### నాలుగు దశల్లో పరిశీలన...

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వివిధ నిబంధనల ప్రకారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో వడపోస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లయితే దరఖాస్తుదారులకు సమాచారం అందుతోంది. పూర్తిస్థాయిలో పత్రాలు సమర్పించకపోయినా సమాచారం రానుంది. వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, పట్టణ ప్రణాళిక, పంచాయతీ శాఖల అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించనుంది.

- నాలాలు, చెరువులు, కుంటలు వారసత్వ సంపద, శిఖం, దేవాదాయ, ఈనాం భూములు వంటివి పరిశీలించి అభ్యంతరాలు ఉన్నట్లయితే నమోదు చేసుకుంటారు. అర్హత ఉన్న వాటిని వెంటనే పరిశీలించి కావాల్సిన పత్రాలతో పాటు ఫీజు చెల్లించేలా సంబంధిత దరఖాస్తుదారుడికి నోటీసు జారీ చేస్తారు.
- దరఖాస్తుదారుడికి సంబంధించి అన్ని వివరాలు సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరించి ఉత్తర్వులు జారీ చేస్తారు. జిల్లా అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ వాటిని పరిశీలించిన తర్వాతే క్రమబద్ధీకరణ చేస్తారు.

## పోస్టుమార్టం వసతి కల్పించాలని ఈటలకు వినతి


ఎంపీ ఈటలకు సమస్యను వివరిస్తున్న బీజేపీ నాయకులు

**మేడ్చల్:** పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ ఆస్పత్రిలో)లో శవ పరీక్షలు (పోస్టుమార్టం) నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పట్టణ బీజేపీ నాయకులు కోరారు. పూడూర్‌లోని తన నివాసంలో ఈటలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దాదాపు నాలుగు దశాబ్దాలుగా మేడ్చల్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న పోస్టుమార్టం కార్యక్రమాన్ని రెండేళ్ల క్రితం నిలిపివేశారని గుర్తు చేశారు. మేడ్చల్ ప్రాంతంలో ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే శవ పరీక్షల కోసం గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. ప్రాణాలు కోల్పోయిన బాధలో కుటుంబాలు ఉన్న సమయంలో శవపరీక్షల కోసం నగరానికి వెళ్లి అక్కడ గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నదని విచారం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు ఉన్నా పాలకులు పట్టించుకోలేదని ఎంపీగా ఈగల రాజేందర్ పట్టించుకుని సమస్యను తీర్చాలని కోరారు. వైద్య శాఖ అధికారులతో మాట్లాడి మేడ్చల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం కార్యక్రమాన్ని పునరుద్ధరించేలా చూస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, బీజేవైఎం అధ్యక్షుడు వంశీ విజయ్, ఉపాధ్యక్షుడు మైసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## 'ఈ రిసోర్సెస్'పై అవగాహన

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ రిసోర్సెస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జాతీయ లైబ్రేరియన్స్ డేను పురస్కరించుకుని కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జే గెట్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ ట్రైనింగ్ మేనేజర్ రతిష్ అయ్యర్ పాల్గొని జర్నల్స్‌లోని వివిధ అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ... కళాశాలలో అత్యాధునిక వసతులతో లైబ్రరీ అందుబాటులో ఉందన్నారు. విద్యార్థులు సదరు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని పరిశోధనాత్మక పత్రాలను సమర్పించుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. జె గెట్ లాంటి వనరులను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, లైబ్రేరియన్ రవిశంకర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మహిళ అదృశ్యం


అంజిలమ్మ

**కీసర:** మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ అదృశ్యమైన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారంలో చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో నివాసం ఉంటున్న అంజిలమ్మ(55)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో అంజిలమ్మ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఫలితం లేదు. దీంతో కీసర పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు.

## కమనీయం సుబ్రమణ్యేశ్వరుడి కల్యాణోత్సవం


చీర్యాల లక్ష్మీనృసింహస్వామిసేవలో పాల్గొన్న ఎమ్మెల్సీ బసరరాజు సారయ్య

**కీసర:** కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామికి శ్రావణ మాస ఉత్సవాల ప్రత్యేక పూజల్లో భాగంగా సోమవారం ఆలయంలో సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన క్షీరాభిషేకం పూజలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం పాల్గొన్నారు. అనంతరం చేపట్టిన స్వామివారి పల్లకీ సేవలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి, అర్చకులు రవిశర్మ, బల్‌రాంశర్మ తదితరులు తెలిపారు.

### రామలింగేశ్వడి సేవలో ఎమ్మెల్సీ...

కీసరగుట్టలోని రామలింగేశ్వర స్వామి సేవలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ చీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

**ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు**

## దరఖాస్తుల ఆహ్వానం

- డీఈఓ విజయకుమారి

**సాక్షి, సిటీబ్యూరో:** సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ఎంపిక కోసం జిల్లాలోని అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 23 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించరన్నారు. డీడీఓ ధ్రువీకరించని దరఖాస్తులను కూడా తీసుకోరని స్పష్టం చేశారు.

## 'డబుల్' ఇళ్ల సముదాయాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు


ఇళ్ల సముదాయాల్లో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

**కీసర:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలోని డబుల్ బెడ్ రూం గృహ సముదాయాల్లో నివాసం ఉంటున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన రాంపల్లి పరిధిలోని డబుల్‌బెడ్ రూం గృహ సముదాయలను ఆయన సందర్శించారు. అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గృహసముదాయాల వద్ద నెలకొన్న చెత్తాచెదారం, పేరుకుపోతున్న వ్యర్థాల సమస్యను పరిష్కరించేందుకు రెండు చెత్త ఆటోలను కేటాయించనున్నట్లు వెల్లడించారు. గృహసముదాయల నుంచి సేకరించే చెత్తను రెండు ఆటోల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తామన్నారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని త్వరలో ఆయా సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు


దమ్మాయిగూడలో వినతిపత్రం స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగమణి

**కీసర:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి పేర్కొన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ కాలనీల్లో ఉన్న సమస్యలకు సంబందించి ప్రజల నుంచి 4 వినతిపత్రాలు అందాయన్నారు.

- నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు అందినట్లు కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు.

### అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

**మేడ్చల్‌రూరల్:** మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని పరుపుల బండ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పరుపుల బండ వద్ద ఉన్న 1500 గజాల స్థలాన్ని పీహెచ్‌సీ సబ్ సెంటర్, సాయిబాబా ఆలయ నిర్మాణానికి కేటాయించారన్నారు. అయితే ఓ వ్యక్తి రాత్రికి రాత్రే ఆ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నాడని వెంటనే అధికారులు తొలగించాలని కోరారు.

## అభివృద్ధి పనుల ప్రారంభం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ శాంతి, కార్పొరేటర్ నవీన్‌కుమార్

**జవహర్‌నగర్:** జవహర్‌నగర్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ సాధారణ నిధులు రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించే డ్రైనేజీ పనులను సోమవారం మేయర్ శాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ... జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రతి డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొస్తానన్నారు. కార్పొరేటర్లు మేక లలితాయాదవ్, గొడుగు వేణు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జ్యోతి, చంద్రకళ, సుభద్ర, సుమిత్ర, రాజు, శ్రీనివాస్, కృష్ణ, మల్లయ్య, పుల్లయ్య, వెంకటేష్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## దృఢ సంకల్పంతో లక్ష్యసాధన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్:** లక్ష్యాన్ని చేరుకోవాలంటే దృఢ సంకల్పం ఉండాలని రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. చౌదరిగూడలోని రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10, 11వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ ముగింపు వేడుకలకు సోమవారం ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. చాంపియన్‌షిప్‌లో ఆతిధ్య స్కూల్ తోపాటు దేవేంద్ర విద్యాలయ, మెరిడియన్ స్కూల్, ఉప్పల్ కేవీ, ఖమ్మం కేవీ, బోయిన్‌పల్లి కేవీ 250 విద్యార్థులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ... చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చాంపియన్‌షిప్‌లో దేవేందర్ విద్యాలయ మొదటి స్థానం, రోటర్ డ్యామ్ స్కూల్ రెండో స్థానం, ఉప్పల్ కేవీ మూడో స్థానంలో నిలిచారు. అసోసియేషన్ స్పోర్ట్స్ సెల్ ఇన్‌చార్జి సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షుడు శేఖర్, రోటర్‌డ్యామ్ డైరెక్టర్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపల్ రూపారెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ హిందువులకు అండగా ఉండాలి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

**మేడ్చల్:** బంగ్లాదేశ్‌లోని హిందువుల ఇళ్లు, మహిళలు, పిల్లలపై జరుగుతున్న దాడులకు తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ సోమవారం మేడ్చల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద హిందూ సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బంగ్లాదేశ్‌లోని హిందువులకు ప్రపంచ దేశాల్లోని హిందూ బంధువులు అండగా నిలవాలని కోరారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ కార్యదర్శులు జాకట ప్రేమ్‌దాస్, లవంగ శ్రీకాంత్, నాయకులు పాతూరి సుధాకర్‌రెడ్డి, కిషన్‌రావు, పంతులు, శ్రీనివాస్ గౌడ్, హేమలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి, సిటీబ్యూరో:** 2024–25వ సంవత్సరానికి సంబంధించి బెస్ట్ అవైలబుల్ స్కూల్ (డే స్కాలర్) పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం 5 నుంచి 6 ఏళ్ల లోపు ఉన్న షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జిల్లా వాస్తవ్యులై ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థి తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల వరకు, పట్టణ ప్రాంతాల వారైతే రూ. 2 లక్షల వరకు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒక్క విద్యార్థి మాత్రమే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి వయస్సు 2024 జూన్ 1 వరకు 5 నుంచి 6 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. కులం, ఆదా య ధ్రువ పత్రాలు మీ సేవ ద్వారా పొంది ఉండాలన్నారు. బాలబాలికలు తమ దరఖాస్తు ఫారాలను ఈ నెల 13 నుంచి 19 వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. బాలబాలికల ప్రవేశం కోసం చింతల్‌లోని ఆర్‌ఎస్‌కే ఉన్నత పాఠశాల, కుషాయిగూడ బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, కూకట్‌పల్లి బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, బోడుప్పల్‌లోని పద్మశ్రీ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ఉన్నట్లు వినోద్‌కుమార్ తెలిపారు.

## 'ప్రజావాణి'లో 73 ఫిర్యాదులు

**సాక్షి, సిటీబ్యూరో:** కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 73 ఫిర్యాదులు అందినట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందులో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.